ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 10 సెప్టెంబరు 2024




ధర్మవరం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న యువకులు


బత్తలపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


పెనుకొండ మండలం గుట్టూరులో గణపయ్యల ఊరేగింపు


కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి ఊరేగింపులో మహిళల కోలాటం

వినాయక లడ్డూ @ రూ.48,500


వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న బేల్దారి మూర్తి

కొత్తచెరువు: స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంపాటు సోమవారం నిర్వహించారు. బేల్దారి మూర్తి రూ.48,500కి దక్కించుకున్నాడు. వేలం పాటలో 30 మంది పోటీపడ్డారు. అనంతరం వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

జై.. జై.. గణేశా..

- ఘనంగా వినాయక నిమజ్జనం
- కోలాహలంగా ఊరేగింపులు
- రంగులు చల్లుకుంటూ యువత, మహిళల సందడి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 9: జిల్లావ్యాప్తంగా సోమవారం వినాయక ప్రతిమలను నిమజ్జనం గావించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులకు మూడురోజుల పాటు పూజలు చేశారు. సోమవారం నిమజ్జనానికి తరలించారు. వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. అనంతరం వినాయక ప్రతిమలను వివిధ వాహనాలపై ఏర్పాటు చేసుకుని, నిమజ్జనానికి బయల్దేరారు. డ్రమ్స్ కొడుతూ యువకులు సందడి చేశారు. మహిళలు, యువత రంగులు చల్లుకుంటూ ఆనందరం పంచుకున్నారు. 'గణేశ్ మహరాజ్ కీ జై' అంటూ నినదించారు. కేరింతలు, డ్యాన్సులు వేశారు. పుట్టపర్తిలో సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు వేదమంత్రాలు చదువుతూ శోభాయాత్ర చేపట్టారు. సమీపంలోని చెరువులు, కాలువల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నీటిలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. భారీ ప్రతిమలను క్రేన్ల సాయంతో నిమజ్జనం గావించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


పుట్టపర్తిలోని ఎనుములపల్లి చెరువులో గణేశుడి నిమజ్జనం


ప్రశాంతి నిలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం సాయంత్రం విద్యార్థులు వినాయక విగ్రహాలను ఊరేగింపుగా సాయి కుల్వంత్ సభామండపానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేశుడిపై భక్తిపాటలు పాడుతూ నృత్యరూపకం ప్రదర్శించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఎనుములపల్లి చెరువులో నిమజ్జనం గావించారు.

నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి: ఎస్పీ

ధర్మవరం: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ రత్న సూచించారు. ధర్మవరం చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ సోమవారం పరిశీలించారు. చెరువులో క్రేన్ల సాయంతో వినాయక విగ్రహాలు వేస్తుండటంతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.


ధర్మవరం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 9: ప్రజలు సమర్పించే ప్రతి అర్జీనీ పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. యంత్రాంగానికి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 174 అర్జీలు అందాయి. వాటిని కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. వేతన బకాయిలు చెల్లించాలంటూ సత్యసాయి నీటి పథకం కార్మికులు.. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 24 నుంచి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పొలంబాట పట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కత్తి కలకలం

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఓ వృద్ధ రైతు వద్ద కత్తి దొరకడం కలకలం రేపింది. బుక్కపట్నం మండలం చింతలయ్యగారిపల్లికి చెందిన రైతు రామనారాయణ భూసమస్యపై వినతిపత్రం అందజేయడానికి కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రధానద్వారం వద్ద పోలీసులు తనిఖీ చేయగా.. కత్తి లభించింది. గ్రామంలో భూసమస్య కారణంగా ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉందనీ, ఆత్మరక్షణకోసం కత్తి ఉంచుకున్నట్లు రైతు.. పోలీసులకు తెలిపాడు. కత్తిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వృద్ధ రైతును వదిలేశారు.

ప్రభాకర్ కుటుంబానికి ఉద్యోగావకాశం

అమడగూరు మండలం కస్సముద్రం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభాకర్‌ను అతడి భార్య భాగ్యమ్మ ప్రత్యేక వాహనంలో కలెక్టరేట్‌కు తీసుకొచ్చింది. మంచానికే పరిమితమైన ప్రభాకర్‌ను కలెక్టర్ గమనించారు. అతడి భార్య భాగ్యమ్మకు ఉద్యోగావకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పొలాలకు దారి చూపండి

దాదాపు వెయ్యిఎకరాల పొలానికి దారిలేక ఇబ్బంది పడుతున్నామనీ, సమస్య పరిష్కరించాలని కొత్తచెరువుకు చెందిన భాస్కర, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, రఘుపతి, శ్రీనివాసులు తదితరులు.. కలెక్టర్‌కు విన్నవించారు. వారు మాట్లాడుతూ.. కొత్తచెరువు వద్ద రైల్వే ట్రాక్ ఏర్పాటుతో పొలాలకు దారిలేకుండా పోయిందని వాపోయారు. దారి చూపాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

డీపీఓలో 15 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని డీపీఓలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 15 అర్జీలు అందాయి. వాటిని జిల్లా ఎస్పీ రత్న స్వీకరించారు. ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలనీ, పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసు వాహనంపైకి రాయి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని గొట్లూరులో ఆదివారం అర్ధరాత్రి పోలీసు వాహనంపై రాయితో దాడి చేశారు. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కుటుంబ సమస్యలతో గొడవ పడడంపై డయల్ 100కి ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ నరేంద్ర వాహనంలో సిబ్బందితో కలిసి అక్కడికెళ్లారు. పోలీసు వాహనాన్ని ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ఉంచి, గొడవ జరిగే ప్రాంతానికెళ్లారు. అక్కడే ఉన్న కొంతమంది ఆకతాయిలు.. పోలీసు వాహనం వైపు రాయి విసిరారు. అది వాహన అద్దానికి తగిలింది. పోలీసులు.. ఓ యువకుడిని పట్టుకుని, విచారించినట్లు సమాచారం. విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో సీరియస్‌గా పరగణించి, విచారించినట్లు సమాచారం.

కూలి బతుకుల్లో కన్నీళ్లు..!



కూలీలు.. నిరుపేదలు..
సొంతూరిలో పని ఉండదు..
పొరుగూరు.. పక్క మండలం,
జిల్లా, రాష్ట్రానికి కూడా వెళ్లాలి..
తెల్లవారుజామునే బయల్దేరాలి..
ఉడికీ ఉడకని ఇంత ముద్దతో చద్ది కట్టుకుని..
చలిలోనే ప్రయాణమవ్వాలి..
మినీ వ్యాన్లు, ఆటోల్లో కుక్కేస్తారు..
అలాంటి కష్టజీవులను
రోడ్డు ప్రమాదాలు కబళిస్తున్నాయి..
పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు..
ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోతున్నాయి..!
కొందరు ఆస్పత్రులపాలవుతున్నారు..
వైద్యం ఖర్చులు భరించలేక..
ఆ కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి..
ఇటీవలిగా వరుస రోడ్డు ప్రమాదాలు
పేద బతుకుల్లో
పెను విషాదం నింపుతున్నాయి..

కష్టజీవులను బలిగొంటున్న రోడ్డు ప్రమాదాలు


పులివెందుల వద్ద ప్రమాదంలో మృతిచెందిన కదిరమ్మ (ఫైల్)

- నెలలోనే మూడు ఘటనలు.. పలువురి మృతి
- పదుల సంఖ్యలో ఆస్పత్రులపాలు
- వీధిన పడుతున్న కుటుంబాలు


పులివెందుల వద్ద బోల్తా పడిన ఆటో (ఫైల్)

ఆగస్టు 2న తలుపుల మండలంలోని బత్రేపల్లి నుంచి దాదాపు 16 మంది కూలీలు పులివెందులకు పనికి బయల్దేరారు. తెల్లవారుతుండగానే ఆనందంగా అందరూ చద్దికట్టుకుని, పనికోసం ఆటో ఎక్కారు. ఎక్కిన అరగంటలోపే ఇద్దరి బతుకులు తెల్లారిపోయాయి. మరో 14మంది గాయపడ్డారు. ఆటో బోల్తాపడి నాగమ్మ, కదిరిమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. కదిరమ్మకు ఇద్దరు చిన్నపిల్లలు. వారు తల్లిలేనివారయ్యారు.

ఈనెల 2వ తేదీన కదిరి పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన 18 మంది మహిళలు పక్కనే ఉన్న పాలసముద్రం వద్దగల ఓ గార్మెంట్స్ పరిశ్రమలో పనికెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. నల్లమాడ మండలంలోని పులగంపల్లి క్రాస్ వద్ద వారు ప్రయాణిస్తున్న మినీ వ్యాన్ బోల్తాపడింది. ప్రమాదంలో 18 మందికి గాయాలయ్యాయి.

ఈనెల 3వతేదీన తెల్లవారుజామున 2 గంటల సమయంలో అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు నుంచి నల్లమాడకు వెళ్తున్న బొలెరో వాహనం తనకల్లు మండలంలోని నారేవాండ్లపల్లి వద్ద సిమెంటు లారీని ఢీకొంది. ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, 29మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురిని అనంతపురం, ఒకరిని కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. ఈ మూడు ప్రమాదాల్లో దాదాపు 60 మందికిపైగా గాయపడ్డారు. ఈ వరుస ప్రమాదాలు కదిరి ప్రాంతంలో కూలీలు, వారి కుటుంబాలను భయభ్రాంతులకు లోనుచేస్తున్నాయి. ఉపాధికోసం వెళితే ఊపిరి పోతోందని వాపోతున్నారు.


నల్లమాడ మండలం పులగంపల్లి క్రాస్‌వద్ద బోల్తా పడిన మినీవ్యాన్ (ఫైల్)

కదిరి, సెప్టెంబరు 9: ఉపాధికోసం పొరుగూరికెళితే ప్రాణాలేపోతున్నాయి. ఉన్నఊరిలో ఉపాధిలేక మరో ఊరికి వెళ్తే వచ్చిపోయేటపుడు వాహనాల్లో భద్రత కరువైంది. రెండునెలల వ్యవధిలో మూడు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 60మందికిపైగా గాయపడ్డారు. మృతిచెందిన, గాయపడిన వారందరూ కూలీలే. ఉన్న ఊరిలో ఉపాధిలేక పొట్ట చేతపట్టుకుని పనికోసం వెళ్లినవారే. రాత్రింబవళ్లు కష్టపడితేగానీ పూటగడవని పరిస్థితి వారిది. ఉన్న ప్రాంతంలో ఉపాధి లేక వలస పోతున్నారు. ఆడ, మగ తేడాలేకుండా అందరూ పనికోసం వెళ్తున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లలో వారిని కుక్కేస్తున్నారు. ఆ వాహనాలు రోడ్డు భద్రత నిబంధనలను గాలికొదిలేస్తున్నాయి. వాటి డ్రైవర్లు, యజమానులు.. కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పనికెళ్లిన చోట కూడా వారికి సరైన తిండి కరువైంది.


తనకల్లు వద్ద ప్రమాదంలో మృతిచెందిన శంకరప్ప (ఫైల్)

పనికి పొరుగూరికి..

కదిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఒక్క పరిశ్రమ కూడా లేదు. కూలీలకు పనికూడా లేదు. దీంతో చదువుకున్నవారైనా, నిరక్షరాస్యులైనా పొట్ట చేతపట్టుకుని, ఉపాధికోసం పొరుగూరికెళ్లాల్సిందే. పక్కనే ఉన్న కడప జిల్లాలోని పులివెందుల, అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, హిందూపురం, గోరంట్ల, పెనుకొండ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. వీరు వచ్చివెళ్లేందుకే రెండు, మూడుగంటలు పడుతుంది. పగలు, రాత్రి పనిచేస్తూ ఏ అర్ధరాత్రో, తెల్లవారుజామునో ఇంటికి చేరుతున్నారు. ఇక్కడ ఆడ, మగ అన్న తేడాకూడా లేదు. కూలీలు వెంట తెచ్చుకున్న భోజనం తిని, మధ్యాహ్నం పని ప్రారంభిస్తే పూర్తయ్యే వరకు భోజనమే ఉండదు. పని అయిపోయే సరికి తెల్లవారుజామున అవుతుంది. ఆ సమయంలో వారు పెట్టే భోజనం తిని, వాహనం ఎక్కాల్సిందే. తిరిగి మళ్లీ ఉదయ 11 గంటలకే ప్రయాణం కావాలి.

సమయాలేవీ?

సాధారణంగా కూలి పనులు ఉదయం నుంచి మధ్యాహ్నం, సాయంత్రం వరకు చేస్తారు. టమోటా మండీలో పనిచేసే వారికి అలాంటి వేళలు ఉండవు. టమోటా మండీలో పనిచేయడానికి తనకల్లు, కదిరి, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, అమడగూరు మండలాలనుంచి ఎక్కువ మంది కూలీలు వెళ్తుంటారు. వీరు ఉదయం 11 గంటలకు ఇళ్ల నుంచి బయల్దేరి అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువుకు మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్తారు. తీసుకెళ్లిన భోజనం తిని పని ప్రారంభిస్తారు. పని అయిపోయే వరకు భోజనం ఉండదు. మరుసటి రోజు తెల్లవారుజామున పని ముగుస్తుంది. ఒక్కోసారి ఉదయం కూడా అవుతుంది. పని పూర్తయితేగానీ, భోజనం చేసే అవకాశం ఉండదు. ఆ తరువాత వాహనంలో ఇంటికి బయల్దేరతారు. అలసిపోయినవారు భోజనం చేసి, వాహనమెక్కిన ఐదు నిమిషాలకే నిద్రపోతారు. ఒక్కో వాహనంలో 30మందికిపైగా బయల్దేరతారు. దీంతో ఒకరిపై మరొకరు పడిపోయి నిద్రపోతుంటారు. ఈ గాఢనిద్రలో ప్రమాదాలు జరుగుతుంటాయి. వారూ రోజూ తెల్లవారుజామున 3గంటల సమయంలో బయల్దేరతారు. ఆ సయమంలోనే ప్రమాదంలో జరుగుతున్నాయి. మరో ప్రమాదాన్నిపరిశీలిస్తే కదిరి నుంచి పాలసముద్రానికి వాహనంలో వెళ్లి తిరిగి రావడానికి కనీసం నాలుగు గంటలుపైగా పడుతుంది. ఇంటికి చేరేటప్పటికి ఏ అర్ధరాత్రో అవుతోంది. తిరిగి ఉదయమే మళ్లీ ప్రయాణం కట్టాల్సి ఉంటుంది. ఇంత దయనీయ స్థితిలో కూలీలు పనిచేస్తున్నారు.

స్పందించని అధికారులు

కూలీలను తరలించే వాహనాలు రోడ్డు భద్రత నిబంధనలను గాలికొదిలేస్తాయి. ఆటోల్లో పదుల సంఖ్యలో కూలీలను కుక్కేస్తారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారుల్లో మాత్రం చలనం లేదు. కళ్ల ముందే అధిక లోడుతో వెళ్తున్నా అడ్డుచెప్పరు. స్థానికంగా ఉపాధి కల్పించే దిశగా కూడా ఆలోచించట్లేదు. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఇతర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లే అవసరం లేకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రమాదాలు వెంటాడుతున్నా.. పూట గడవాలంటే.. ప్రయాణం కట్టాల్సిన దుస్థితి కూలీలది.

స్థానికంగా ఉపాధి కల్పించాలి



సొంతూరిలోనే పనులు కల్పిస్తే, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. పనుల కోసం వెళ్లి, ప్రాణాలు పోగొట్టుకునే దుస్థితి రాదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఆలోచించాలి. స్థానికంగా ఉపాధి కల్పించాలి.

\- మంజునాథ్, గూడమేకలపల్లి, నల్లమాడ మండలం

వచ్చేశారు..

- నగరానికి చేరిన మరో రెండు జట్లు
- ఇండియా-ఎ, బి జట్ల సభ్యులకు ఘన స్వాగతం



శివందూబేకు పూలతో స్వాగతం పలుకుతున్న సిబ్బంది

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9: దులీప్‌ట్రోఫీలో పాల్గొనేందుకు ఇండియా-ఎ, ఇండియా-బి జట్లు సోమవారం అనంతపురం చేరుకున్నాయి. ఈనెల 12నుంచి 15 తేదీ వరకు క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. నాలుగు మ్యాచ్‌లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఇప్పటికే ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య ఒక మ్యాచ్ పూర్తయ్యింది. ఈక్రమంలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇండియా-ఎ: మయాంక్ అగర్వాల్ (కెప్టెన్), రియాన్‌పరాగ్, అక్షయ్‌వాడ్కర్, ఎస్‌కె రషీద్, తిలక్‌వర్మ, శివం దూబే, తనుష్ కొటియాన్, శాంష్‌ములాని, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, ఆవేష్‌ఖాన్, కుమార్‌కుషర్గ, శావత్ రావత్, అఖీబ్‌ఖాన్, ప్రతమ్‌సింగ్.

ఇండియా-బి: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), రింకూసింగ్, నవదీప్‌సైనీ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్‌కుమార్, ఆర్ సాయికిశోర్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్ రెడ్డి, సుయాష్ ప్రభుదేశాయి, రాహుల్ చాహర్, ఎన్ జగదీషన్, హిమాన్షుమంత్రి, సౌరాషిస్ లహరి, మోహిత్ అవాస్థి, జర్నల్‌సింగ్.

రెండో హోటల్‌లో ప్లేయర్లకు బస



తిలక్‌వర్మ, ప్రసిథ్‌కృష్ణ, రింకూసింగ్‌లకు స్వాగతం

ఇండియా ఎ, బి జట్ల ఆటగాళ్లు సోమవారం మధ్యాహ్నం నగరంలోని మాసినేని గ్రాండ్‌హోటల్‌కు చేరారు. ఆంధ్రా క్రికెట్ సంఘం, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు, హోటల్ సిబ్బంది ఆటగాళ్లకు పుష్పగుచ్ఛం అందించి, తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. కాగా ఇప్పటికే ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లు నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో దిగిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా హోటల్‌కే పరిమితమైన ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లతో ఇండియా ఎ, బి జట్ల ఆటగాళ్లు మంగళవారం ఏసీజీలో నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొననున్నారు.



వాషింగ్టన్ సుందర్‌కు హారతి ఇస్తున్న హోటల్ సిబ్బంది

దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌లు ఇవే..

ఇప్పటికే తొలిమ్యాచ్ పూర్తికాగా ఈనెల 12 నుంచి 15వతేదీ వరకు ఇండియా- ఎ, ఇండియా- డి మధ్య, (ఏ గ్రౌండ్), ఇండియా బి-ఇండియా సి (బి గ్రౌండ్)మధ్య, 19 నుంచి 22వరకు ఇండియా ఎ-ఇండియా సి (ఏ గ్రౌండ్) మధ్య, ఇండియా బి-ఇండియా డి(బి గ్రౌండ్) జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.



మయాంక్ అగర్వాల్‌కు స్వాగతం

చీనీ టన్ను రూ.22వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 67టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.24



అనంతపురం రూరల్, సెప్టెంబరు 9: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

నిధుల స్కాం కలకలం

కమిషనరేట్ అధికారుల ఆరా

అనంతపురం విద్య, సెప్టెంబరు 9: జిల్లా సాధారణ పరీక్షల మండలిలో నిధుల స్కాం బహిర్గతం కావడంతో బాధ్యులైన అధికారుల్లో గుబులు మొదలైంది. డీసీఈబీలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్- షీట్స్ ముద్రణకు నకిలీ వర్క్ ఆర్డర్‌ను అధికారులు సృష్టించారు. డీఈఓ వరలక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాకు వచ్చారు. కానీ డిసెంబరులోనే ఆమె జిల్లాలో ఉన్నట్లు నకిలీ ఉత్తర్వులను డీసీఈబీ అధికారులు సృష్టించారు. ఈ వ్యవహారంపై 'నిధుల స్కాం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఉపాధ్యాయులు, విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా డీసీఈబీ అధికారులు రూ.31.8 లక్షల విలువైన వర్క్‌కు సంబంధించిన ఉత్తర్వులు సృష్టించడం బయటపడటంతో ఆయా వర్గాల్లో టెన్షన్ మొదలైంది. ఉమ్మడి జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఆఫీసర్, జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి సైతం ఈ కథనంపై ఆరా తీసినట్లు తెలిసింది. సెలవులో ఉన్న డీఈఓ వరలక్ష్మి సైతం సంబంధిత అధికారులను ఏం జరుగుతోందని ప్రశ్నించి, అసంతృప్తి వ్యక్తం చేసిందని తెలిసింది. విజయవాడలోని పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు సైతం విచారణకు సిద్ధమైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

దివ్యాంగ బాలికపై అత్యాచారం..నిందితుడి ఆత్మహత్య

నంబులపూలకుంట, సెప్టెంబరు 9: శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలోని ఓ గ్రామంలో దివ్యాంగ బాలికపై నాగార్జున(32) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి డీఎస్పీ శ్రీలత తెలిపిన మేరకు, సారగుండ్లపల్లికి చెందిన నాగార్జున తన భార్యను ఆదివారం పుట్టింట్లో వదిలేందుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. రాత్రికి తిరిగి వచ్చే సమయంలో, ఆదే మార్గంలో ఉన్న ఓ ఊరిలో దివ్యాంగురాలైన బాలిక, మరికొందరు చిన్నారులు ఆడుకుంటూ కనిపించారు. దివ్యాంగ బాలికను నాగార్జున ముళ్ల పొదల్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఇది చూసిన చిన్నారులు కేకలు వేయడంతో గ్రామస్థులతోపాటు బాలిక తండ్రి అక్కడికి చేరుకున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా స్వగ్రామానికి పారిపోయాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని రాసుకున్న సూసైడ్ నోట్‌ను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బాధిత బాలికను ఆస్పత్రికి తరలించామని, నిందితుడి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని డీఎస్పీ తెలిపారు. నాగార్జున వైసీపీ హయాంలో గ్రామ వలంటీరుగా పనిచేశాడు. రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది.

12న ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం 12వ తేదీన కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఐఏబీ ఛైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్ హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 26.368టీఎంసీల నీటిని కేటాయించారన్నారు. ఇందులో జిల్లాకు 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించడం, మిగిలిన 16.365 టీఎంసీల నీటిని లక్ష ఎకరాల్లో ఆరుతడి పంటల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. అవసరానికి అనుగుణంగా ఆన్ అండ్ ఆఫ్ విధానాన్ని అమలు చేసి, నీటి కొరత రాకుండా చూస్తామన్నారు. నీటి చౌర్యం, నీటి వృథాని అరికట్టడంపై, అనధికారిక నీటి వాడుకను అరికడతామన్నారు. ఇక హంద్రీ నీవా, మైనర్ ఇరిగేషన్‌తో పాటు హెచ్చెల్సీకి కేటాయించిన నీటి విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

4 కిలోలకు పైగా మత్తు పదార్థం స్వాధీనం



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన బద్దిపూటి శ్రీధర్(ప్రస్తుతం అనంతపురంలోని బళ్లారి బైపాస్ సమీపంలో), గుండారపు నాగరాజులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 4400 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రూ.30,500లు, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. బద్దిపూటి శ్రీధర్ పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో టెంకాయల మండి నిర్వహిస్తున్నాడు. దాంతో వచ్చే సంపాదన తాను చేసే జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని భావించాడు. టెంకాయలను అమలాపురం, రాజమండ్రి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి లారీలలో తెప్పిస్తుండేవాడు. ఈ క్రమంలో రాజమండ్రిలో ప్రసాద్ అనే కారు డ్రైవర్ పరిచయం అయ్యాడు. ప్రసాద్ గంజాయి వ్యాపారం చేస్తుంటాడని తెలుసుకుని అతడి ద్వారా అనకాపల్లి నుంచి టెంకాయల మధ్యలో గంజాయిని పెట్టి తెప్పించేవాడు. తన గ్రామానికే చెందిన, వరుసకు అన్న అయిన గుండారపు నాగరాజుతో కలిసి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో ఉంచి ఎక్కువ ధరకు విక్రయించేవాడు. ఆదివారం కారులో గంజాయిని విక్రయించేందుకు తరలిస్తుండగా సీఐ శాంతిలాల్, ఎస్‌ఐ గోపాలుడు సిబ్బందితో కలిసి బళ్లారి బైపాస్‌లోని ఎంజీ పెట్రోల్ బంకు సమీపంలో శ్రీధర్, నాగరాజులను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఏడాది ఫ్రీనే

- ఈ ఖరీఫ్‌కు ఉచిత పంటల బీమా వర్తింపు
- రబీ నుంచి రైతులు ప్రీమియం కట్టాల్సిందే
- గెజిట్ నోటిఫికేషన్ జారీ



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పలు రకాల పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింప జేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఉచిత పంటల బీమా కొనసాగుతుంది. ఈ మేరకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఉచిత పంటల బీమాను అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమాను వర్తింపజేశారు. రబీలో టమోటా పంట వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమాను వర్తింపజేశారు. దిగుబడి ఆధారిత బీమా కింద ఖరీఫ్ సీజన్‌లో కంది, వరి, మొక్కజొన్న, జొన్న పంటలు చేర్చారు. రబీ సీజన్‌లో పప్పుశనగ, వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటకు వర్తింపజేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే రైతులకు ఉచిత పంటల బీమాను వర్తింపజేస్తారు. ఈ పంట నమోదు ఆధారంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమాను అమలు చేస్తారు.

ఈ ఏడాది రబీ నుంచి ప్రీమియం చెల్లించాల్సిందే

ఈ ఏడాది రబీ నుంచి రైతులు పంటల వారిగా బీమా వర్తింపు కోసం నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ పంట నమోదుతోపాటు బ్యాంకుల్లో రుణం తీసుకునే రైతులు బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించాలి. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లల్లో డీడీ తీసి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆఫీస్‌కు పంపాల్సి ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి వేరుశనగకు 2 శాతం ప్రీమియం, పత్తికి 3 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

13లోగా బదిలీలు పూర్తి చేయండి

- ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశం
- ఏంటో..ఇదంతా పై స్పందించిన కలెక్టరు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 9: బదిలీల ప్రక్రియను ఈనెల 13 లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు.సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ఏంటో ఇదంతా శీర్షికన బదిలీలో నెలకొన్న అయోమయ పరిపరిస్థితులపై ఓ కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టరు స్పందించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి బదిలీలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరెవరిని బదిలీ చేయాలో వారి జాబితాను తొలుత తయారు చేసి వెయిటింగ్ ఫర్ పోస్టింగ్స్ ఉంటే అలాంటి వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఉన్న ఖాళీల వివరాలను కార్యాలయాలలో ప్రదర్శించాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో జరిగే బదిలీలు అన్నీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సందేహాలు, సమస్యలు ఏర్పడితే డీఆర్‌ఓ లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలు, రైతులకు తెలిసేలా ప్రతి గురువారం ఉదయం 7-45గంటలనుంచి 8-15వరకు ఆల్ఇండియా రేడియోలో కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందులో ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొనాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. వెల్ఫేర్ అధికారులు తమ ఫోన్ నెంబర్లను ఆయా హాస్టళ్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, వివిశాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు, డీఆర్‌ఓ తదితరులు

బాధితుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వద్దు

బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 315మంది బాధితులు తమ సమస్యల గురించి వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతోపాటు డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శిరీషా, కరుణకుమారి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో గ్రీవెన్స్ ఫిర్యాదులపై కలెక్టరు సమీక్షించారు.

- **ఆస్పత్రులలో మౌలిక వసతులు కల్పించాలి**

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలలో మౌలిక వసతుల కల్పనకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్నింటికి ఎన్క్వేర్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రులలో ఇంటర్నల్ రోడ్లు, సివిల్ వర్కులు, తాగునీటికొలాయి కనెక్షన్స్, మరుగుదొడ్లు, విద్యుత్, బయో మెడికల్ స్టోరేజ్ పాయింట్స్, సూచిక బోర్డులు వంటివి చేపట్టాలన్నారు. సివిల్ వర్కులకు సంబంధించి ఎంఎస్ఐడీసీ వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లాలో వివిధశాఖలలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల పక్రియ పూర్తి చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఆఫీస్ సబార్డినేటర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, వీఆర్ఏ నుంచి వీఆర్‌ఓలుగా, వీఆర్‌ఓలనుంచి సీనియర్‌అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లుకు డిప్యూటీ తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అలాగే కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈపక్రియ 15రోజులలో పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు.

గొల్లపల్లికి నో సిగ్నల్

- మొబైల్ నెట్‌వర్క్ లేక గ్రామస్థుల ఇబ్బందులు
- ఇంట్లో ఉంటే మోగని ఫోన్లు
- ఫోన్‌లో మాట్లాడాలంటే ఊరి బయటకెళ్లాల్సిందే

రాప్తాడు, సెప్టెంబరు 9: ఆ ఊరిలోని ఏ ఇంట్లోకి ఏ మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ రావు. ఎవరికైనా ఫోన్ చేయాలంటే మిద్దె ఎక్కాలి లేదా ఊరు బయటకెళ్లాలి. ఇది రాప్తాడు మండలంలోని గొల్లపల్లి పరిస్థితి. గొల్లపల్లి 44వ జాతీయరహదారి పక్కనే, మరూరు టోల్ గేట్‌కు కి.మీ దూరంలో ఉంది. దాదాపు 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలోని ప్రతి ఇంట్లో రెండు, మూడు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. కానీ జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ తదితర నెట్‌వర్క్ టవర్లు ఆ గ్రామానికి చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆ గ్రామంలో మొబైల్ నెట్వర్క్ అందకపోవడమే ప్రధాన సమస్యగా ఉంది. అప్పుడప్పుడు ఒక పాయింట్ సిగ్నల్ వస్తూ... పోతూ... ఉంటుంది. గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడం వలన గ్రామస్థులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఉన్నప్పుడు సిగ్నల్స్ రాకపోవడం వలన ఎవరి ఫోన్లు రావు. ఎవరికైనా ఫోన్ చేయాలంటే మిద్దె ఎక్కాలి... లేదా ఊరు బయటకు వెళ్లి ఫోన్ చేసి మాట్లాడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఊరికి వచ్చినప్పుడు వర్క్ ఫ్రం హోం చేయాలంటే సిగ్నల్స్ లేక ఆన్‌లైన్ వర్క్ సకాలంలో చేయలేకపోతున్నారు. ల్యాప్ టాప్‌లో పని చేయాలంటే మిద్దెలపైకి ఎక్కి నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో సిగ్నల్స్ లేకపోవడం వలన యువకులు ఎక్కువ సమయం మరూరు టోల్ గేటు వద్ద, జాతీయ రహదారి పక్కన గల టీ కేఫ్‌లలో గడుపుతుంటారు. ఏదైనా పని నిమిత్తం గొల్లపల్లికి వచ్చినవారి పరిస్థితి అగమ్యగోచరం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి సిగ్నల్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సిగ్నల్స్ లేక ఇబ్బంది పడుతున్నాం



నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. మా గ్రామంలో ఏ సిగ్నల్స్ రావు. దీంతో వర్క్ ఫ్రం హోం చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నా. రూ. 40 వేలు ఖర్చు చేసి ఫైబర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నా ప్రయోజనం లేదు.

\- కళ్యాణ్ గ్రామస్థుడు

ఫోన్ మాట్లాడాలంటే బయటకెళ్లాలి



మా ఊర్లో ఏ సిగ్నల్స్ రావు. ఇంట్లో ఉన్నప్పుడు ఫోన్లు రింగ్‌కావు. దీంతో బంధువులు, మిత్రుల సమాచారం సకాలంలో తెలుసుకోలేపోతున్నాం. ఫోన్‌లో మాట్లాడాలంటే బయటకెళ్లాలి. మిద్దె ఎక్కితే అరకొరగా సిగ్నల్స్ వస్తాయి. వాయిస్ క్లారిటీగా ఉండదు. ఊరిబయటకెళ్లి ఫోన్‌లో మాట్లాడాలి.

\- మల్లికార్జున గ్రామస్థుడు.

జీడిపల్లి రిజర్వాయర్‌కి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 9 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులు ఉన్నటు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కుల నీరు వెళుతోందని వెల్లడించారు. రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యలు పట్టవా ?

\- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 9: తాగునీటి కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా..? అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ప్రశ్నించారు. తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి క్లాక్‌టవర్ నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుటే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆదేశంతో కార్మికులను ఒక్కొక్కరిగా లోనికి అనుమతించడంతో వారు కలెక్టర్‌ను కలిసి వ్యక్తిగత అర్జీలను అందజేసి, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను చెల్లించాలని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఐదో రోజు కొనసాగిందన్నారు. కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని నమ్ముతున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రతి మూడునెలలకోసారి కార్మికులు రోడ్డెక్కితే తప్ప వేతనాలందని దుస్థితి ఉండేదన్నారు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళనకరంగా ఉందన్నారు. తక్షణమే 8 నెలల బకాయి వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కోరారు. రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చించి, త్వరలోనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, జడ్పీ సీఈఓలను పిలిచి, పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శ్రీరాములు, తిప్పేస్వామి, త్రిలోక్, బాలకృష్ణ, బాబయ్య, వెంకటేష్, మధు, సోము, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి, రామాంజనేయులు, రాముడు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

అంతా కవరింగే..!

- పేరుకు మాత్రమే నిషేధం
- జిల్లాలో యథేచ్ఛగా వినియోగం
- మనుషులు, జంతువుల ప్రాణాలకు ముప్పు
- అయినా చర్యలు నామమాత్రం




ధర్మవరంలోని అంజుమన్ సర్కిల్‌లో జట్కా స్టాండ్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారి పక్కన పడివున్న కవర్లు

ధర్మవరం, సెప్టెంబరు 9: నిషేధిత ప్లాస్టిక్‌ను జిల్లాలో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. హాని కరమైన ప్లాస్టిక్‌ను నిషేధించామంటూ ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిత్యం చెబుతున్నా... క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ప్లాస్టిక్ కవర్ లేనిదే రోజు గడవదన్నట్టు మారి పోయింది. ప్లాస్టిక్ కవర్లను వాడితే కలిగే దుష్ప్ర భావాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలయ్యారు. పైగా గుడ్డ, జూట్‌తో చేసిన బ్యాగ్‌లను అందు బాటులో ఉంచడం లేదు. వ్యాపారులు బహి రంగంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా వాటిని అరికట్టేలా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. కొంతకాలం హడావిడిగా దాడులు చేయడం.. తర్వాత మిన్నకుండి పోవడం అధికారులకు అలవాటై పోయింది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ అధికారులు వ్యాపార, కాయగూరల, పండ్ల మార్కెట్ తదితర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. భారీ జరిమా నాలు విధించి.. ఆ ప్లాస్టిక్‌ను కాల్చివేయాలి. ఈ నిబంధనలు అమలు కాకపోవడంతో విచ్చలవిడిగా వినియోగం జరుగుతోంది.

నాయకుల ఒత్తిళ్లు..: ఉమ్మడి జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, మూడునగర పంచాయతీల్లో దాదాపు దశాబ్దాల క్రితమే ప్లాస్టిక్ నిషేధ చర్యలు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీలలో కమిషనర్ ఆదేశాల ప్రకారం కొంత మేరకు ప్లాస్టిక్ నిషేధం అమలు చేసినా... రాజకీయ నేతల జోక్యంతో కథ మళ్లీ మొదటికి వస్తోంది.

తనిఖీలు అంతంతే..: ఉమ్మడి జిల్లాలలోని మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నా... స్థానిక అధికారులు నామ మాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపు కొంటున్నారు. దీంతో వ్యాపారులు పెద్దగా లెక్క చేయడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరిగే సమ యంలో తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయి నిషేధంపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

కంపెనీలను అడ్డుకోవాలి: వాస్తవానికి పాలిథిన్ సంచులు తయారుచేసే కంపెనీలపై చర్యలు తీసుకుంటే వినియోగాన్ని నివారించవచ్చు. కాని పాలకులు, అధికారులు అలా చేయడం లేదు. కేవలం వాటిని విక్రయిస్తున్న దుకాణాదారులపై మాత్రమే చర్యలు తీసుకొంటున్నారు. అసలు ప్లాస్టిక్ వస్తువులు తయారు కాకుండా చర్యలు తీసుకుంటే ఇక వాటిని వాడే అవసరమే ఉండదు కాదా.. అని మేధావులు సూచిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి: పర్యావరణానికి పెద్ద శత్రువుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు ప్రజలు సహకరించాలి. స్వచ్ఛందంగా చైతన్యవంతులై వీటిని వినియోగించడం మానేస్తే సమాజానికి చాలా మేలు చేసినవారవుతారు. ఆ విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలి. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వాటిని కఠినంగా అమలు చేయకపోవడంతో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

పాలకులు స్పందించాలి



ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రభుత్వాలు, అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించాలి. ఉమ్మడి జిల్లాలో ఒక్క తాడిపత్రి మున్సిపాలిటీలో మాత్రం ప్లాస్టిక్ నిషేధం అమలవుతోంది. ఇక ఎక్కడా అమలు కావడం కాలేదు. తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులిపేయకుండా ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి.

- ఆదినారాయణ, ధర్మవరం

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి



ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయి. వాటి వల్ల పర్యావరణానికి ముప్పు. అంతేకాకుండా ప్లాస్టిక్ వల్ల మనుషులకే కాదు జంతువుల ప్రాణాలకూ హానికల్గిస్తా యి. కావున ప్రభుత్వాలు ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలి.

-రాజశేఖర్, ముదిగుబ్బ

జరిమానాలు విధిస్తాం

ధర్మవరం పట్టణంలో దుకాణాలు, హోటళ్లు ఇతర వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను అమ్మరాదు. ఇది వరకే ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అంతేకాకుండా దాడులు చేసి జరిమానాలు కూడా విధించాం. ఎవరైన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మితే జరిమానాలు విధించి కేసులు నమోదు చేయిస్తాం.

- శామ్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ధర్మవరం

బైక్ నుంచి పడి మహిళ మృతి

బత్తలపల్లి, సెప్టెంబరు 9: బత్తలపల్లి సమీపంలో బైకు నుంచి కింద పడి ధర్మవరం రాజేంద్రనగర్‌కు చెందిన రామాంజినేయులు భార్య నాగరత్నమ్మ (38) మరణించింది. ఆదివారం రాత్రి ఈ దంపతులు బైక్‌లో ధర్మవరం నుంచి అనంతపురం వెళ్తుండగా... బత్తలపల్లిలోని బైపాస్ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ నుంచి నాగరత్నమ్మ కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. నాగరత్నమ్మకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి...

కదిరి అర్బన్, సెప్టెంబరు 9: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో మరాఠీ రమేష్ (34) అతిగా మద్యం తాగి సోమవారం మరణించాడు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన ఇతను తన భార్య రమ్య, మేనల్లుడు సతీష్‌తో కలిసి కుమ్మరవాండ్లపల్లిలో కొన్ని సంవత్సరాలుగా నివాసమున్నాడు. వీరు స్టీలు, సిల్వర్ సామన్లు గ్రామాల్లో అమ్ముకుని జీవనం సాగించేవారు. సతీష్ కొంతకాలంగా ఇళ్ల అద్దెకుని, సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నారు. మేనల్లుడ్ని చిన్నప్పటి నుంచి తానే పెంచి.. వ్యాపారం నేర్పించానని, ఇప్పుడు పక్కకెళ్లి వ్యాపారం పెట్టుకున్నాడని రమేష్ రోజు బాధపడుతూ మద్యం తాగేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి నిద్రించాడు. సోమవారం అతనిలో చలనం లేకపోవడంతో అతని చుట్టుపక్కల వారి సాయంతో రమేష్‌ను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తులో ఉందని రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లకు గాయాలు

తనకల్లు, సెప్టెంబరు 9: మండలంలోని సీజీ ప్రాజెక్టు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కుమారుడూ స్వల్పంగా గాయపడ్డాడు. అమడగూరు మండలంలోని జొౌకల చుట్టు పక్కల గ్రామాల నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టుకు భారీగా తరలివచ్చారు. ఇద్దేవాండ్లపల్లికి చెందిన లక్ష్మీదేవి, ఆమె భర్త, ఆమె కుమార్తె హారిక, కుమారుడు యశ్వంత్ బైక్‌లో నిమజ్జనాన్ని తిలకించడానికి వచ్చారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా... వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి, హారిక తీవ్రంగా, యశ్వంత్ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ తల్లీకూతుళ్లను 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కదిరికి, అక్కడి నుంచి అనంతపురానికి తరలించారు.

17న అరుణాచలానికి బస్సు

ధర్మవరం, సెప్టెంబరు 9 : ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, కాణిపాకంకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఈనెల 17న ఉదయం 6 గంటలకు ఇక్కడ బయలు దేరి వెళ్తుందన్నారు. రానుపోను చార్జీ రూ.1400 అని వివరించారు. భక్తులు ముందుగానే ఆన్‌లైన్ లేదా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో సీట్లను రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 63031 51302, 99592 25859 నెంబర్లను సంప్రదించాలన్నారు.

12,13 తేదీల్లో క్రీడాపోటీలు


ధర్మవరం, సెప్టెంబరు 9 : మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం మండల కో-ఆర్డినేటర్ పీడీ రఘునాథ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగేంద్ర, వ్యాయామ ఉ.పాధ్యాయులు లక్ష్మీనారాయణ, సరళ తదితరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లలో బాలుర, బాలికలకు అండర్-14, 17 విభాగాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

వివిధ గ్రామాల్లో లడ్డూ వేలం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 9: మండలంలో వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనానికి ముందు లడ్డు వేలంపాట నిర్వహించారు. వెంకటాపురంలో చిరంజీవి, మహేశ్వర, సుధీర్ అన్నదమ్ములు రూ.40 వేలుకు వేలం పాడి లడ్డు దక్కించుకున్నారు. అదే గ్రామంలో మరో విగ్రహం వద్ద కుచ్చెపు శ్రీనివాసులు రూ.20 వేలు, నాయుడు రూ.10 వేలకు లడ్డు దక్కించుకున్నారు. నారప్పగారిపల్లి రెడ్డిపల్లి మహేశ్వర్‌రెడ్డి, ఆంజన్‌రెడ్డి, నాగరాజు రూ. 30 వేలకు, ఎం. కొత్తపల్లిలో జి.కరుణాకర్‌రెడ్డి రూ.75,100కు, అల్లాపల్లి బి. శివశంకర్‌కుమార్ రూ.11 వేలకు లడ్డు దక్కించుకున్నారు.

నల్లమాడ : మండలంలోని రాగానిపల్లిలో వినాయకుడి ఉన్న లడ్డుకు వేలం పాట నిర్వహించారు. ఇందులో 15 మంది పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన పి. ఆదినారాయణ రూ.1.82 లక్షలకు ఆ లడ్డును దక్కించుకున్నాడు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీ



గాండ్లపెంట, సెప్టెంబరు 9: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఇన్‌చార్జి ఎంపీపీగా గంగోజమ్మ సోమవారం బాధ్యత స్వీకరించారు. గతంలో పని చేస్తున్న ఎంపీపీ తాతం జగన్మోహన్ రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీ గంగోజమ్మను ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఎంపీడీఓ రామానాయక్, ఈఓఆర్‌డీ సునీతమ్మ, ఎంపీటీసీ జయరామ క్రిష్టారెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, మాజీ సర్పంచ్ కాకార్ల రవీంద్రారెడ్డి నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ



పోలీసు కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 9: పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులను కోల్పోయిన పోలీసు కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎస్పీ రత్న హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ మేరకు పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ చంద్రానాయక్ మరణించగా.. అతని భార్య శాంతమ్మకు అడిషనల్ కార్ప్‌సఫండ్ కింద రూ.లక్ష అందజేశారు. ఏఆర్ కానిస్టేబుల్ కమలాకర్‌నాయుడు భార్య ముత్యాలమ్మకు పోలీసుశాలరీ ప్యాకేజ్ ద్వారా రూ.ఐదు లక్షల రూపాయల చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్పీ సీఐ బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, సీసీ రాఘవేంద్ర, ట్రెజరర్ షౌకత్‌వలి పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేయొద్దు

జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గిస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రత్న హెచ్చరించారు. జిల్లాలో అక్కడక్కడ ప్రభుత్వ ఆస్తులను నష్టపరిచేవిధంగా కొందరు వ్యవహరిస్తున్నారని, అటువంటివారు వాటికి స్వస్తి పలకాలని హితవు పలికారు. శిథిలావస్థలో ఉన్న భవనాలైన సరే ప్రభుత్వ భవనాలను కూల్చేటప్పుడు సంబంధత అధికారులతో అనుమతి పొందాలన్నారు. వీటికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా అటువంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఎస్పీ హెచ్చరించారు.

గుంజీలు తీస్తూ సత్యసాయి కార్మికుల నిరసన



ధర్మవరంలో గుంజీలు తీస్తున్న కార్మికులు



ముదిగుబ్బలో నోటి మీద వేలేసుకుని కార్మికుల నిరసన

ధర్మవరం, సెప్టెంబరు 9: స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవపురం వద్దగల సత్యసాయి పంపు హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులు సోమవారం గుంజీలు తీస్తూ నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా జీతాలు అందలేదని వాపోయారు.

ముదిగుబ్బ : తాగునీటి కార్మికులకు జీతాలు చెల్లించాలని స్థానిక సత్యసాయి పంప్ హౌస్ వద్ద 19వ రోజూ సమ్మె కొనసాగించారు. నోటిమీద వేలు పెట్టుకొని.. నిరసన తెలిపారు.

సీఎం సహాయనిధికి కళాజ్యోతి విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న సభ్యులు

ధర్మవరం, సెప్టెంబరు 9: ముఖ్యమంత్రి సహాయ నిధికి ధర్మవరానికి చెందిన కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ సభ్యులు రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఆ చెక్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సోమవారం అందజేశారు. ఇందులో కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు నారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటనారాణ, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు సింగనమల రామకృష్ణ, కార్యవర్గసభ్యులు గోరకాటి పెద్దారెడ్డి, పల్లెం వేణుగోపాల్, రాంప్రసాద్, సుందరేశం, రమేశ్ రామన్న, పోలా వెంకటనారాయణ, మధుసూదన్, మోహన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం సేకరణ



బియ్యం సేకరిస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ : స్థానిక టీడీపీ నాయకులు గ్రామాల్లో తిరిగి వరద బాధితుల కోసం బియ్యం సేకరిస్తున్నట్లు కన్వీనర్ మైలే శివ శంకర్ పేర్కొన్నారు. సోమవారం ఒక్కరోజే 33 బస్తాల బియ్యం సేకరించామన్నారు. మరో రెండు రోజుల పాటు విరాళాలు సేకరించి వాటిని వరద బాధితులకు పంపుతా మన్నారు. ఈ సేకరణలో సలాంఖాన్, బుట్టి నాగభూషణ నాయు డు, మైలే రామచంద్ర, మంజునాథ్‌రెడ్డి, నరసింహులు, మస్తాన్, చిన్నా, కె. మంజునాథ్‌రెడ్డి, నబీరసూల్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9 : కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు నియమితులయ్యారు. అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న శ్రీనివాసులును ఉద్యోగోన్నతిపై కదిరి ఆర్టీఓగా బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుకు పాముకాటు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని కోనాపు రంలో ఉంటికొండ భాస్కర్ అనే రైతు పాముకాటుతో తీవ్ర అస్వస్థత కు గురైనట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. కోనాపురానికి చెందిన భాస్కర్ ఇంటి పెరటిలో కోళ్లను పెంచడానికి ఓ జాలరీ ఏర్పాటు చేసుకున్నాడు. దాని వైరు తీసే క్రమంలో జాలరీ వద్దకు వెళ్లగా అతడి కుడికాలికి పాముకాటేసింది. దీంతో అతడు ఒక్కసారిగా అరవడంతో స్థానికులు గమనించి హుటాహుటిన పెనుకొండ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ నారాయణ స్వామి, అడ్వకేట్ శరత్ బాబు, సుబ్రహ్మణ్యం, వెంకటేశులు, బెల్లం శివశంకర్, నాగరాజు, ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని భాస్కర్‌ను పరామర్శించారు.

గొర్రెల మందపై చిరుత దాడి

అగళి, సెప్టెంబరు 9: మండలంలోని కదిరేపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన మంజునాథ్ సోమవారం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. గ్రామ పొలిమేరలో గొర్రెలు మేతమేస్తుండగా ఒక్కసారిగా చిరుత దాడిచేసి ఓ గొర్రెను లాక్కెళ్లి సగం తినేసినట్లు బాధితుడు మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరుతను చూసి భయపడి కేకలు వేసి గొర్రెలను స్వగ్రామానికి తోలుకొచ్చినట్లు తెలిపాడు. చిరుత సంచారం కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లోని గొర్రెల కాపరులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.

వినాయకా.. వీడుకోలిక..!

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సోమవారం గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యువతీ, యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారి విగ్రహాలను ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



పుట్టపర్తిలో గణేశ్ నిమజ్జనంలో యువత కేరింతలు



పుట్టపర్తిలో సలార్ కారులో వినాయకుడి ఊరేగింపు



ఎన్పీకుంటలో...



ధర్మవరంలో రంగులు చల్లుకుంటూ స్వామి వారి నిమజ్జనానికి..



ధర్మవరం చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం



గాండ్లపెంట మండలంలోని వద్దిరెడ్డిపల్లిలో...



నల్లచెరువు విజయలక్ష్మి కాలనీలో నిమజ్జనం హంగామా



ముదిగుబ్బలో డప్పువాయిద్యాల నడుమ నిమజ్జనానికి..



అమడగూరులో నిమజ్జనం సందర్భంగా ఉట్టి కొడుతున్న యువకులు



కొత్తచెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

రాయితీపై ఉలవలు తీసుకెళ్లండి: ఏడీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఉలవ విత్తనాలను అవసరమున్న రైతు లు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ చందన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటి వరకు పంటలు సాగుచేయని రైతులకు ప్రభుత్వం 80శాతం రాయితీతో ఉలవ విత్తనాలను ఆర్‌ఎస్‌కేల ద్వారా అందిస్తోందన్నారు. పదికిలోల బ్యాగు ధర రూ.870ఉండగా 80శాతం రాయితీ పోను రూ.170 రైతువాటా చెల్లించాలన్నారు. ఎకరా పొలానికి ఒక బ్యాగు చొప్పున గరిష్టంగా ఐదు బ్యా గులు పంపిణీ చేస్తామని తెలిపారు.

అన్నదానం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 9: ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. దాదాపు ఐదు సంవత్స రాలుగా ట్రస్ట్ తరుపున రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ కన్వీనర్ సూరి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరికుమార్, వైద్యులు ఓంకార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీడీపీఓగా శాంతలక్ష్మి

గుడిబండ, సెప్టెంబరు 9: గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా శాంతలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్క డ పనిచేస్తున్న పద్మావతి డిప్యుటేషన్‌పై రాయదుర్గానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో పెనుకొండలో పనిచేస్తున్న శాంతలక్ష్మికి ఉన్నతాధికారులు గుడిబండ సీడీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

దేమకేతేపల్లిలో వైద్యశిబిరం



దేమకేతేపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటుచేసిన దృశ్యం

చిలమత్తూరు, సెప్టెంబరు 9: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ తేజస్విని పేర్కొన్నారు. మండలంలోని దేమకేతేపల్లిలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె రోగులకు వైద్య పరీక్షలు, చికిత్సలు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా సీజనల్‌గా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలకు దూరంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరాలతో బాధపడేవారు వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, టీడీపీ నాయకులు వేణు, మంజునాథ్, గోపీనాథ్, రంగస్వామి, సత్యనారాయణ, రమేష్, గంగాధర్, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 9: సోమందేపల్లిలోని వినాయకనగర్ ఎస్సీకాలనీకి చెందిన నరేష్(20) సోమ వారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎస్సీకాలనీకి చెందిన నరేష్ కొంతకాలంగా బెంగళూరులో స్థిరపడి, అక్కడే పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. సోమందేపల్లిలో ఉంటున్న తండ్రి గంగప్ప వద్దకు రావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లాడు. అతడిని పరీక్షించి అనంతపురానికి రెఫర్ చేసినట్లు వైద్యాధికారి హరికుమార్ తెలిపారు. పరిస్థితి విషమించడంతో అతడిని బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వైద్యుడు, కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సూచించారు. ముందస్తు చర్యల్లో భాగంగా వినాయకనగర్‌లోని మురుగు కాలువల్లో పైరేత్రియం స్ప్రే చేయించినట్లు తెలిపారు.

రైతుకు పాముకాటు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని కోనాపురంలో ఉంటికొండ భాస్కర్ అనే రైతు పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. కోనాపురానికి చెందిన భాస్కర్ ఇంటి పెరటిలో కోళ్లను పెంచడానికి ఓ జాలరీ ఏర్పాటు చేసుకున్నాడు. దాని వైరు తీసే క్రమంలో జాలరీ వద్దకు వెళ్లగా అతడి కుడికాలికి పాముకాటేసింది. దీంతో అతడు ఒక్కసారిగా అరవడంతో స్థానికులు గమనించి హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, అడ్వకేట్ శరత్ బాబు, సుబ్రహ్మణ్యం, వెంకటేశులు, బెల్లం శివశంకర్, నాగరాజు, ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని భాస్కర్‌ను పరామర్శించారు.

గొర్రెల మందపై చిరుత దాడి

అగళి, సెప్టెంబరు 9: మండలంలోని కదిరేపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన మంజునాథ్ సోమవారం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. గ్రామ పొలిమేరలో గొర్రెలు మేతమేస్తుండగా ఒక్కసారిగా చిరుత దాడిచేసి ఓ గొర్రెను లాక్కెళ్లి సగం తినేసినట్లు బాధితుడు మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరుతను చూసి భయపడి కేకలు వేసి, గొర్రెలను స్వగ్రామానికి తోలుకొచ్చినట్లు తెలిపాడు. చిరుత సంచారం కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లోని గొర్రెల కాపరులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.

బాల్య వివాహంపై ఫిర్యాదు

అగళి, సెప్టెంబరు 9: మండలపరిధిలోని ఓ గ్రామంలో బాల్య వివాహం చేయ నిశ్చయించినట్లు ఫిర్యాదు వెళ్లడంతో ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు, ఏంఈఓ చంద్రశేఖర్ నాయుడు.. గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఇరు కుటుంబాల వారిని పిలిపించి అవగాహన కల్పించారు. బాల్య వివాహం చేస్తే ఇరు కుటుంబాలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9: నగరంలోని గాంధీబజార్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. బుక్కరాయసముద్రానికి చెందిన గోగుల నారాయణ (75) అనే వృద్ధుడు వ్యక్తిగత పనిమీద బత్తలపల్లి వెళ్లి తిరిగి బస్సులో వచ్చి నగరంలోని సంఘమేష్ సర్కిల్ దిగాడు. బుక్కరాయసముద్రం వెళ్లడానికి తాడిపత్రి బస్టాండ్‌కు వెళ్తుండగా బసవన్న కట్ట సమీపంలో ఎక్సెల్ వాహనం వేగంగా వెళ్తూ నారాయణను ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన నారాయణను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అతిగా మద్యం తాగి వ్యక్తి...

కదిరి అర్బన్, సెప్టెంబరు 9: మండలంలోని కుమ్మరవాండపల్లిలో మరాఠీ రమేష్ (34) అతిగా మద్యం తాగి సోమవారం మరణించాడు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన ఇతను తన భార్య రమ్య, మేనల్లుడు సతీష్‌తో కలిసి కుమ్మరవాండ్లపల్లిలో కొన్ని సంవత్సరాలుగా నివాసమున్నాడు. వీరు స్టీలు, సిల్వర్ సామన్లు గ్రామాల్లో అమ్ముకుని జీవనం సాగించేవారు. సతీష్ కొంతకాలంగా ఇళ్ల అద్దెకుని, సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నాడు. మేనల్లుడ్ని చిన్నప్పటి నుంచి తానే పెంచి.. వ్యాపారం నేర్పించానని, ఇప్పుడు పక్కకెళ్లి వ్యాపారం పెట్టుకున్నాడని రమేష్ రోజు బాధపడుతూ మద్యం తాగేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి నిద్రించాడు. సోమవారం అతడిలో చలనం లేక పోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో రమేష్‌ను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించాగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తులో ఉందని రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

ఇళ్ల పట్టాలివ్వాలని ఆందోళన

● తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పాలసముద్రం వాసులు

గోరంట్ల, సెప్టెంబరు 9: మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలి వద్ద ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న పేదలకు హక్కు పత్రాలివ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య ఆధ్వర్యంలో కూడలి వద్ద నివాసమున్న పేదలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... తమకు పట్టాలివ్వాలని పాల సముద్రంలోని సర్వేనెంబర్ 125లో కొంతకాలంగా నివాసమున్నవారు పలుమార్లు రెవెన్యూ అధికారుల విన్నవించారని అన్నారు. ఇళ్లు లేనివారికి నిబంధనల మేరకు పట్టాలు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వీఆర్ఓ అనిల్‌కు వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కరించకపోతే ఈనెల 18న పేదలతో వెళ్లి ఆర్డీఓను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకురాలు స్వర్ణలత, ఆంజనేయులు, వెంకటేష్, అంజనాదేవి, ముత్యాలప్ప, షాతాజ్, నంజుడప్ప, ప్రదీప్, రామాంజనమ్మ, లక్ష్మీదేవి, గంగమ్మ, శోభ తదితరులు ఉన్నారు.

పెనుకొండ: ఇల్లులేని నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలువురు పేదలు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, కార్మిక సంఘం ఆఫీస్ బేరర్ నారాయణ, తదితరులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు బేబీకి అందించారు. పట్టణంలోని సర్వేనంబరు 668లో గుడిసెలు వేసుకుని జీవనం సాగి స్తున్న పేదలందరికీ ఇంటిపట్టాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జీవనం చేస్తున్న వారి గుడిసెలను ఏడాది క్రితం పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు తొలగించారన్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయించగా కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిం దన్నారు. ఈ విషయంపై తహసీల్దార్, సబ్‌కలెక్టర్, కమిషనర్‌ను కోరగా ఎన్నికల తరువాత పట్టాలు ఇస్తామని మాట ఇచ్చారన్నారు. ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదన్నారు. కోర్టు ఆదేశాలను అనుసరించి వెంటనే ఇంటిపట్టాలు మంజూరు చేయాలని కోరారు.

టెర్రరిస్టులను తలపించిన వైసీపీ పాలన

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, సెప్టెంబరు 9: వైసీపీ ఐదేళ్ల పాలన టెర్రరిస్ట్ పాలనను తలపించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసి సోమవారానికి ఏడాది అయిన సందర్భంగా అంజినప్ప ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన అరాచకాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, దందాలతో సాగిందన్నారు. అదిచాలక ప్రజానాయకుడు చంద్రబాబును సంబంధం లేని కేసులో అక్రమంగా అరెస్ట్ చేయించడం దుర్మార్గమన్నారు. అదేరోజు వైసీపీ పతనానికి నాంది పడిందన్నారు. జగన్ పాలన సైకో పాలనగా సాగిందన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత కలిగిన చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేస్తే దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు ప్రపంచంలో దేశాల్లో నిరసనలు తెలిపారన్నారు. చంద్రబాబును అరెస్ట్‌చేస్తే లండన్‌లో ఉండి జగన్ హేళనగా మాట్లాడాడన్నారు. అదే సరిగ్గా ఏడాదికి జగన్ లండన్‌కు వెళ్లడానికి వీలులేకుండా ఇబ్బంది పడుతున్నాడని అన్నారు. ఇదే దేవుని స్క్రిప్ట్ అని అంజినప్ప పేర్కొన్నారు.

వరద బాధితులకు మహిళల సాయం



టీడీపీ నాయకులకు చెక్కు అందజేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాదితులకు అండగా హిందూపురం పట్టణ మహిళా సమాఖ్య సభ్యులు తమవంతు సాయం అందజేశారు. వారు సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1.5లక్షలు చెక్కును అందజేశారు. ఈ చెక్కును టీడీజీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బలరాంరెడ్డి, కౌన్సిలర్ డీఈ రమేష్‌కు అందించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వరద బాధితులకు పట్టణ మహిళా సమాఖ్య తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ వరద బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం, విరాళాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, వెంకటలక్ష్మీ, విజయలక్ష్మీ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు మల్లికాబాను, కవిత, కొట్నూరు నాగభూషణం, కింగ్ షఫీ, దాదు, కిరోసిన్ బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే రైతు సంక్షేమం'



సమావేశంలో పాల్గొన్న కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్

అగళి, సెప్టెంబరు 9: రైతుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డరంగేగౌడ్ అధ్యక్షతని మండలంలోని రామాపురం గ్రామంలోని మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి ఇంటి ఆవరణంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్చార్జ్ కేఆర్‌వీ గుప్త, జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డరంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నారాయణప్ప, రవీంద్ర, మంజు, మంజునాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

పావగడ, సెప్టెంబరు 9: తాలూకా పరిధిలోని పలవల్లి కామనదుర్గ, చిన్నపల్లి గ్రామ పంచాయతీలలో మైనార్టీల అభివృద్ధి కింద రూ.6కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సోమవారం భూమిపూజ చేశారు. అదేవిధంగా తాగునీటి పథకానికి అవసరమైన పైప్ లైన్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నాణ్యమైన పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రంలో పీడీఓలు హనుమేష్, చిన్నయ్య, అక్కులప్ప, పంచాయతీ అధ్యక్షులు సరిత, బాబు, ఉపాధ్యక్షులు ముత్యాలక్క, అంజన్‌రెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

భవనం కూల్చివేతపై పాడి రైతుల నిరసన

హిందూపురం, సెప్టెంబరు 9 : పట్టణంలోని పేట వెంకటర మణ స్వామి వీధిలో మైలార లింగేశ్వరస్వామి ఆలయానికి ఆనుకుని మిల్క్ సొసైటీ భవనాన్ని కూల్చివేయడంపై సోమవారం కో ఆపరేటివ్ పాల సరఫరా రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆ భవనాన్ని ఈనెల 6వ తేదీ రాత్రి కూల్చివేశారు. దీనిపై పాలసరఫరా రైతు సంఘం ఆధ్వర్యంలో అప్పట్లో పాలు క్రయ విక్రయాలు చేసిన రైతులు కూల్చివేసిన స్థలంలో నిరసన తెలిపారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ బాలాజీకి వినతిపత్రం అందించారు. తాము ఏర్పాటు చేసుకున్న భవనం కొన్నేళ్లుగా పాల వ్యాపారం లేకపోవడంతో మూతబడిందన్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది భవనాన్ని రాత్రికి రాత్రే కూల్చివేయడం సరికాదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా మిల్క్ సొసైటీ భవనం కూల్చివేసిన స్థలాన్ని మైలార లింగేశ్వర స్వామి ఆలయానికి అప్పగించాలని వీరశైవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లింగాయత్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందించారు.

టీచర్ బదిలీని రద్దు చేయాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 9: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని శ్రీరంగరాజులపల్లికి బదిలీచేశారు. టీచర్ బదిలీని రద్దు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గత వారం పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. ఇప్పటి దాకా టీచర్ బదిలీని రద్దు చేయక పోవడంతో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈఓ లక్ష్మీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీచర్ భాగ్యలక్ష్మి బదిలీని రద్దు చేసే విధంగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంఈఓకు వినతిపత్రం అందించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 9 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. పరిగి సెక్టార్-1, 2 అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది గర్భిణులు, బాలింతలు హాజర య్యారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రొటీన్లు అధిక మోతాదులో ఉండే ఆహారం తీసు కుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వరూపరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి, నాయకులు బాలాజీ, హనుమయ్య, శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఘనంగా నాగుల పండుగ

గుడిబండ, సెప్టెంబరు 9: మండలంలోని ఎస్ఎస్‌గుండ్లు, పూజారిపల్లి, ఎస్.రాయాపురం, సీసీగిరి, మండలపల్లి తదితర గ్రామాల్లో సోమవారం ప్రజలు మహిళలు నాగుల పండగను నిర్వహించారు. గ్రామ పరిదిలోని నాగులకట్ట, పుట్ట వద్దకువెళ్లి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధుగిరి వద్ద ఘోరం

- ఎదురెదురుగా రెండు కార్లు ఢీ
- ఆరుగురి మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు



ప్రమాదంలో మృతిచెందిన వారు

పావగడ, సెప్టెంబరు 9 : మధుగిరి తాలూకా కేరేగల పాళ్య సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంలో ఆరుగురు మృతి చెందగా, ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. పావ గడ తాలూకా ఎద్దులపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి కుటుంబం బెంగళూరులో నివాసముంటున్నారు. వినాయకచవితి పండుగ సందర్భంగా వారు గత శుక్రవారం స్వగ్రామానికి వచ్చారు. పండుగ ముగించుకుని ఆదివారం రాత్రి బెంగళూరుకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మధుగిరికి చెందిన నాగరాజు, డ్రైవర్ సిద్దగంగప్ప వస్తున్న కారు కెరగల పాళ్య వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో జనార్దన్‌రెడ్డి (55), కుమార్తె సింధుజ(30), ఆమె కుమారుడు యోగేష్(8), మరో కారులోని డ్రైవర్ సిద్దగంగప్ప (52), నాగ రాజు(30) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయప డిన జనార్దన్‌రెడ్డి కారు డ్రైవర్ ఆనంద్ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమ వారం ఉదయం మరణించాడు. ఇతడు కూడా జనార్దన్‌రెడ్డి సమీప బంధువని సమాచారం. జనార్దన్‌రెడ్డి కారులో ప్రయాణిస్తున్న ఆయన బంధువు గీతా రాణి, ఆమె పదినెలల కుమార్తె తీవ్రంగా గాయప డ్డారు. వారు తుమకూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఎమ్మెల్సీ రాజేంద్ర మధుగిరి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాలను సందర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.



మధుగిరి ఆసుపత్రిలో మృతదేహాల వద్ద సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

ఘనంగా గణపయ్యల నిమజ్జనం



హిందూపురం మండలం మిట్టమీదపల్లిలో వినాయకుడి ఊరేగింపు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని శనివారం ప్రతిష్ఠించిన విగ్రహాలకు మూడో రోజు సోమవారం విశేష పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు. పలు చోట్ల లడ్డూల వేలం నిర్వహించారు. ఘనంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. స్థానిక చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. హిందూపురం మండలం, పెనుకొండ, గోరంట్ల, పట్టణాల్లోని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అలాగే సోమందే పల్లి, పరిగి, లేపాక్షి, అమరాపురం, రొళ్ల, గుడిబండ, అగళి తదితర మండలాల పరిధిలోని వినాయకుల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



గోరంట్లలో వినాయకుడి ఊరేగింపు



అమరాపురంలో...



పెనుకొండలో గణనాథుల ఊరేగింపు



పెనుకొండలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వీధి దీపాల ఏర్పాటు

మడకశిర టౌన్, సెప్టెంబరు 9 : ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు కొద్ది రోజుల క్రితం 13వ వార్డులో పర్యటించిన సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్‌ను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో రెండు రో జులుగా ఆయా కాలనీల్లో వీధి దీ పాలను ఏర్పాటు చేస్తున్నారు. 13వ వార్డులో కౌన్సిలర్ సుజాతా రమేష్, మున్సిపల్ సిబ్బంది వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు ప్రతి వార్డులోను వీధి దీపాలు లేనిచోట ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక కౌన్సిలర్లు తెలిపారు.



13వ వార్డులో వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇల్లు కట్టుకుంటుంటే అడ్డుపడుతున్నారు

●నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

పెనుకొండ, సెప్టెంబరు 9 : ప్రభుత్వం తమకు మంజూరుచేసిన ఇంటి స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపడుతుంటే కొందరు అడ్డుకుంటున్నారని నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు వాపోయారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఎంసీబాబు, రామాంజనేయులు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... పట్టణానికి చెందిన సర్వేనంబరు 190లో 3.58ఎకరాల భూమిలు రజకులు, నాయీబ్రాహ్మణలతో పాటు ఇతరులకు ప్రభుత్వం పట్టాలు మంజూరుచేసిందన్నారు. ఇస్లాపురానికి చెందిన గొల్ల సత్తెన్నకు సర్వేనంబరు 193లో భూమి ఉందన్నారు. అతను తమకు ఇచ్చిన భూమిలో 193సర్వే నంబరు వేసి పది మందికి ఇంటిపట్టాలు అమ్ముకున్నాడన్నారు. ప్రస్తుతం తాము తమకిచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే సత్తెన్న ద్వారా ఇంటిపట్టాలు కొన్నవారు ఈ భూమిలో తమకు పట్టాలు ఇచ్చారని మీరు ఎలా కడుతున్నారని అడ్డుకుంటున్నారని వాపోయారు. అంతేగాకుండా తాము వేసిన పునాదులను ధ్వంసం చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మంత్రి సవిత, డీఎస్పీ, సీఐ, తహసీల్దార్‌కు వినతులు అందించామని తెలిపారు.